# కింకరుడు 123

చిత్రగుప్తుడు అలికిడి విని, తల ఎత్తి చూశాడు. కింకరుడు 123 కొందరు జీవులను వెంటబెట్టుకు వస్తూ కనిపించాడు. చిత్రగుప్తుడు తన డిజిటల్ రిస్ట్ వాచి కేసి చూసుకుని, ముఖం చిట్లించాడు.

"నూట ఇరవైమూడూ నువ్వు రోజూ ఆలస్యం అవుతున్నావు. అరగంట లేటు" అన్నాడాయన.

"మీకు తెలిందేవుంది గుప్తాగారూ. ఈ రోజుల్లో డాక్టర్లు మనుషుల్ని త్వరగా చావనియ్యడం లేదు లైఫ్ సేవింగ్ డ్రగ్స్! ఇందులో ఇద్దర్ని డాక్టర్లు వచ్చినాక ఇరవై నిమిషాలు ప్రాణం పోకుండా పట్టివుంచారు. పద్దెనిమిది మందిని కలిపే పట్టుకుని రమ్మంటిరి మరి ! మిగిలిన అయిదుగురి కోసమూ మళ్ళీ పోవాలి."

"వెంటనే పోకపోతే అందుకూ లేటవుతావు!"

"నాకీ మెసింజరు డ్యూటీ వద్దు. స్టోకింగులో పెట్టండి బాబూ అంటే, నా లాంటి ఎఫిషెంటు మెసెంజరుండడని తఁవరే అన్నారు - ఇప్పుడేఁవో..."

"అసలే ఆలస్యం ఆయిందిరా అంటే ఖబుర్లలో పడ్డావా ? పద పద" అని చిత్రగుప్తుడు కింకరుణ్ణి తొందర చేశాడు.

123 వెళ్ళిపోయాక చిత్రగుప్తుడు చిటా పుస్తకంలాగి, తెరిచి పేజీలు తిప్పి ఆగంతుకులను ఇంటర్వ్యూ చేశాడు.

"మీరంతా ఎలక్షను కొట్లాటలో బదిలీ అయినవాళ్ళేగా" అన్నాడు చిత్రగుప్తుడు. బదిలీ అంటే మనుష్య భాషలో చావు.

"నేను కానండీ !" అన్నాడొక లావుపాటి మనిషి.

చిత్రగుప్తుడు ఆ మనిషికేసి పరికించి చూసి, "అవును! నువ్వీ గుంపులోకి ఎలా వచ్చావు? నీ రంగు వేరే?" అన్నాడు.

"మీ కింకరుణ్ణి అడగండి. నాకు రోగం గాని, రొష్టుగాని లేదు. ఒంటిమీద చిన్న గీరైనా లేదు."

"నీ పేరు?"

"పరబ్రహ్మం!"

చిత్రగుప్తుడు నెత్తిబాదుకుని 'హయ్యో రామ! తీసుకురావలిసింది ఇంకో పరబ్రహ్మాన్ని. ఈ నూట ఇరివైమూడుకు మతి సరిగా ఉండటం లేదు." అన్నాడు.

ఆయన నోటిమాట నోట్లో వుండగానే కింకరుడు మరికొందరిని తెచ్చాడు. చిత్ర

గుప్తుడు తనకేసి చంపేటట్టు చూస్తూండటం వాడికి కనిపించింది.

"మళ్ళీ ఏమైయుంటుంది?" అనుకున్నాడు 123.

"ఈ పరబ్రహ్మాన్ని ఎందుకు తెచ్చావు ? వీడికి మెల్లకన్నుందా ? వీడిది అడ్డతలా ? నువు చాతగాని పోస్ట్‌మన్‌లాగా అడ్రసులు గల్లంతు చేస్తుంటే ఎట్లా ? వీణ్ణి వెంటనే తీసుకుపోయి, అసలువాణ్ణి పట్రా. నీ గురించి బాస్‌తో ఫిర్యాదు చెయ్యాలిసిందే"

123 దిక్కు మొహం వేశాడు. పెద్దపొరపాటే జరిగింది. ఇటువంటిపొరపాట్లవల్లే యమలోకపు టాప్ సీక్రెట్స్ మనుషులకు తెలిసిపోతున్నాయి. వాళ్ళు సైకిక్ రిసెర్చిలోకి దిగుతున్నారు. మనుషులు తమదే లోకంగా వుండటం ఎంతైనా అవసరం.

వాడు క్షణాలమీద పరబ్రహ్మంను మార్చేశాడు.

అక్కడ భూలోకంలో గొప్ప సంచలనం జరుగుతున్నది. పరబ్రహ్మం అనేవాడు మృత్యుముఖం నుంచి తప్పించుకు వచ్చినట్టు చెప్పుకుంటున్నారు.

"అవును. నన్ను మట్టలాగులవాళ్ళు పట్టుకుపోయి యమధర్మరాజు ముందు పెట్టారు. వీణ్ణెందుకు తెచ్చార్రా ? తేవలసినవాడు ఇంకో పరబ్రహ్మం అంటున్నాడు యముడు" అంటున్నాడు చచ్చి బతికినవాడు.

"నాన్సెన్స్! అంతా భ్రమ ఆ దొమ్మిలో తల తిరిగి పడిపోయాడు. మళ్ళీ కోలుకున్నాడు. మటలాగులవాళ్ళూ, యమధర్మరాజూ అంతా భ్రమ" న్నాడొక హేతువాది.

"వీడు బతికినాక ఇంకో పరబ్రహ్మం చచ్చాడండీ మరీ?" అన్నాడెవరో.

"అబద్ధం! ఓ వేళ ఇంకోలోకం వుంటే మాత్రం అక్కడ ఈ పేర్లుంటాయా? నమ్మరాదు !"

"పుట్టబోయే వాళ్ళందరి పేర్లూ నాడీ గ్రంథాల్లో వుండగాలేందీ—"

"ఒక మూఢ విశ్వాసానికి పదిహేను మూఢ విశ్వాసాలు మద్దతు."

"పరబ్రహ్మాన్ని పరీక్షించి డాక్టరు ప్రాణం పోయిందని చెప్పాడు గదండీ?"

"డాక్టర్లు పొరపాటు పడరుటయ్యా?"

"బాబూ, నీకు యమలోకంలో ఇంకెవరన్నా కనబడ్డారా?"

"లేదండీ! మట్టలాగులవాళ్ళూ, యమధర్మరాజూ, నేను—"

"ఈ మట్టలాగులవాళ్ళను గురించి నువు లోగడ వినివున్నావా అబ్బా?"

"మా అమ్మమ్మ చెప్పేదండీ"

"ఇంకేం? అదే తల్లో వుండి, అప్పజెప్పుతున్నాడు!"

చచ్చి బతికినవాణ్ణి గురించి లోకులు చెప్పుకోవటం మానటానికి ఎంతోకాలం పట్టలేదు. పరబ్రహ్మానికే అంతా కలేనేమో ననిపించసారంభించింది. త్వరలోనే అతడు చావు వ్యాపారం నుంచి బతుకు వ్యాపారంలో పడిపోయాడు.

కింకరుడు 123 యముడికి అర్జీ పెట్టుకున్నాడు. మెసెంజరుగా తనమీద బ్లాక్

మార్కులు రావటానికి తన తప్పు ఏమీలేదనీ, ద్వాపర యుగంనాటి పద్ధతులు మానేస్తే తప్ప ప్రాణులను తెచ్చే కార్యక్రమం ఎఫిషంటుగా సాగదనీ, వెనకటికాలంలో మార్కండేయుడి కేసులాటివి చాలా అరుదుగా వుండేవిగాని. ఇప్పుడు దాదాపు అన్ని కేసులూ "ఎ టిపికల్"గానేవుంటున్నాయనీ, మెసెంజర్లు తమ విధి నిర్వర్తించటంలో ఎంతో వుపజ్ఞ చూపవలసి వస్తున్నదనీ, వాళ్ళు తమ డ్యూటీ చెయ్యటంలో సొంత జడ్జిమెంటు వుపయోగించే హక్కులు ఇయ్యబడాలనీ, తనను స్టోకింగుకు మార్చమని చాలాసార్లు అర్జీపెట్టుకుని వున్నా ఫలితం కనిపించలేదనీ చాలా గట్టిగా చెప్పాడు.

యముడు చిత్రగుప్తుడికి ఆ అర్జీని పంపుతూ దాని మీదనోట్ పెట్టాడు: ట్రాన్స్ఫర్లు వాంఛనీయం కాదు – అనుభవం వున్న మెసెంజర్లను నరకజ్వాలలను చూడటానికి పెట్టడం మంచిదికాదు. సర్వీస్ రూల్స్ కొంచెం సడలించవచ్చు.

చిత్రగుప్తుడు చీదరించుకున్నాడు. ఒక్క కింకరుడి కోసం సర్వీస్ రూల్స్ సడలిస్తే యమలోకంలో క్రమశిక్షణ ఏం వుంటుంది ?

ఆయన పాత చిఠా తిరగవేశాడు.

భవార్ సన్యాసి కేసు బంగిల్ చేసిన మెసెంజరు ఎవరు ? కింకరుడు 123 కాదు. మరొకడు. బెర్లిన్ ఆస్పత్రి కేసు ? అప్పుడుకూడా చిక్కిన ప్రాణిని వెనక్కి పోనిచ్చినవాడు కింకరుడు 123 కాదు.

కింకరుళ్ళ రికార్డు తీసి చూస్తే ప్రతివాడూ ఏదో కేసు బంగిల్ చేసినవాడే. అందాకా ఎందుకు ? యమధర్మరాజు స్వయంగా బంగిల్ చేసిన కేసులెన్ని లేవు ?సత్యవంతుడికేసూ, మార్కండేయుడికేసూ, చెప్పుకుని ఇప్పటికీ నరకంలో నవ్వుకుంటూనే ఉన్నారు. యమధర్మరాజు చెయ్యి జారిపోనిచ్చిన సత్యవంతుణ్ణి కింకరుడు 32 అవలీలగా తెచ్చాడు దానికేమిటి ?

ఇవిగాక యమ కింకరులకూ, విష్ణుకింకరులకూ ఎన్నిసార్లు కొట్లాటలు జరగలేదు. విష్ణుదూతలు కేసు గెలిచినపుడల్లా తప్పుడు నిర్ణయం యముడిదేనని తేలింది. యముడి రికార్డే అలా అఘోరిస్తే ఇక కింకరులను తప్పుపట్టే పనేమిటి?

చిత్రగుప్తుడు యముడి నోట్ క్రింద "నోటెడ్" అని రాసి సంతకం పెట్టి, కాగితం ఫైల్లోపెట్టి. ఫైల్‌ను గురిగా బీర్వాలోకి గిరవాటువేశాడు.

తరవాత ఆయన 123ను పిలిచి, మొత్తానికి నువ్వే నెగ్గావు. కాని ఒక్కటడుగుతాను చెప్పు ! మంచి ప్రెస్టేజియస్ మెసెంజరు పనిమాని స్టోకింగ్ చేస్తానో అని అఘోరిస్తావేం ?"

"మీకు తెలవందేముందీ? వెనకటిలాక్కాదు. గుప్తాగారూ అంతా ఒకటే రష్ ! చేసేపని తాపిగా, నాజూగ్గా చెయ్యటానికి లేదు. యుద్ధకాలమైతే పోనీ అనుకోవచ్చు. మీరు అలా నా వెంట ఒకసారివస్తే తెలుస్తుంది. ఒక విమానం కూలటమూ, రెండొందల పదహారు మంది చావటమూ ! ఒక రైలు ప్రమాదం జరగటమూ కొన్ని డజన్లు చావటమూ !

పోలీసుల ఫైరింగులు! దిక్కులేని వాళ్ళను ఇళ్ళలో బంధించి ఇళ్ళు తగులబెట్టి డజన్లు లెక్కలో చూపడం తమకు తెలిని లెక్కలా? యుద్ధకాలం లాగే మంది చావులు కొనసాగుతున్నాయి. ఆకలి ఆత్మహత్యలు కూడా ఒకటీ, ఆరాకాదు తల్లీ—ముగ్గురు పిల్లలూ! మొగుడూ పెళ్ళాం, అయిదుగురు పిల్లలూ!"

"అవునురా! జనాభా పెరిగిపోతుంటే చచ్చేవారి సంఖ్య పెరుగుతుంది మరి. దామాషాన చూసుకుంటే ఇప్పుడు చావులు తక్కువే."

"దామాషాలు మనకెందుకండీ? అదంతా రాజకీయవాదుల పరిభాష. మెసెంజర్ల సంఖ్య పెంచాలి. లేదా ఉమ్మడి చావులు తగ్గించాలి. అదీగాక చచ్చే వాళ్ళంతా అర్భకపు జనం. నరక కూపాల్లోకి వచ్చే వాళ్ళు ఘరానా మనుషులు! స్టోకింగ్ చేస్తూ కూర్చునేవాడికి గొప్ప కంపెనీ! పదేసి కుటుంబాలను దివాలా తీయించినవాళ్ళు! రాష్ట్రాలను గడగడ లాడించిన వాళ్ళు! తనకు అడ్డం వచ్చిన వాళ్ళను ఏకంగా అదృశ్యం చేసిన వాళ్ళు! ఎన్నిరకాలు!"

చిత్రగుప్తుడు తల ఆడించి "నీకు యాభై రెండేళ్ళ లీవు పేరుకుని వున్నది. కాస్త రష్ తగ్గినప్పుడు లీవు గ్రాంటు చేస్తాను. నరక కూపాల మధ్య నీ చిత్తం వచ్చినట్టు విహరింతువుగాని! స్టోకింగ్ చేసేపని కూడా వుండదు" అన్నాడు.

"రష్ తగ్గినప్పటి మాటగద!" అన్నాడు 123."

"ఏఁవైంది?" అని అడిగింది కింకరుడి పెళ్ళాం.

"ఈసారికి మనఁవే నెగ్గాం. కాని నన్ను మంటలకు మార్చరుట!" అన్నాడు కింకరుడు 123.

"అసలు నీకేఁవన్నా బుద్ధుందా?"

"ఏం?" అన్నాడు 123 ఆశ్చర్యంగా.

"స్టోకింగ్ చేస్తానంటావే, అది ప్రమోషననుకుంటున్నావా?"

"ఎందుక్కాదూ?"

"మంటలు మరింత నరకం కాదా? హాయిగా చల్లగాలికి తిరిగే పని మానుకుని మంటలో మగ్గుతానంటావేవిటి? ఇంతకుముందే వెయ్యిన్నొకటి వచ్చి చెప్పాడు. విప్లవం చేద్దామనుకుంటున్నారు మనవాళ్ళు—వాళ్ళు చెప్పే దాంట్లో పాయింటుంది మరి" అన్నది 123 పెళ్ళాం.

"విప్లవమా? ఏవిటా పాయింటు?" అన్నాడు 123 అయోమయంగా.

"వెయ్యిన్నొకటిని కలుసుకొని మాట్లాడు."

కింకరుడు 1001 నరకంలో పుట్టి పెరిగినవాడు కాదు. మనిషిగా పుట్టి, నాస్తికుడుగా ప్రసిద్ధికెక్కి, కొన్ని లక్షల మందికి దేవుడిలో నమ్మకం పోగొట్టి, చచ్చి నరకానికి వచ్చి, ఇరవై వేల ఏళ్ళ నరక శిక్ష విధించబడి, కొంతకాలం క్రితం కింకరుడుగా రిక్రూట్ అయినవాడు.

"అన్నా, మా ఆవిడతో విప్లవం మాటేదో అన్నావుట! అసలు సంగతేవిటి?" అని 123 అడిగాడు.

1001 చాలాసేపు మాట్లాడాడు.

"నువు సెక్షను మారాతానంటున్నావుటగా? అందువల్ల నీకేం ఒరుగుతుంది? నీకు నరక జీవితం తప్పుతుందా? నువు నరకంలో ఎందు కుంటున్నావో ఎప్పుడన్నా ఆలోచించావా?"

"ఇది మరీ బావుంది! నే నిక్కడేగా పుట్టి పెరిగిందీ?" అన్నాడు 123.

"నేను కాదనటం లేదురా బాబూ. నే నిక్కడ పుట్టలేదు. పాపాలు చేశాననీ శిక్ష కింద నరకవాసం కలిగించారు. నీకూ, నాకూ తేడా ఏవిటి? నువు ఏ పాపం చేసి ఈ నరకంలో వుంటున్నావు?"

"అదా నువ్వనేదీ? నరకంలో పుట్టి పెరిగినవాడికి నరకంలో వుండటం శిక్ష ఎట్లా అవుతుందీ?"

"కొంత కాలానికి నేను నరకంలో నుంచి పోతాను. ఇంకో లోకంలో పుడతాను. పుణ్యం చేసుకుని స్వర్గానికి పోయే అవకాశం నాకున్నది. నీకున్నదా?"

"అవును. లేదు."

"నువ్విక్కడ చచ్చిపోతే ఇంకో నరకంలో పుడతావు. బ్రహ్మప్రళయందాకా నీకు నరకం తప్పదు ఇది అన్యాయం కాదా? నీవంటివాళ్ళు విప్లవం చెయ్యాలి! ఉత్తమ లోకాలకు పోయే అర్హత సంపాదించుకోవాలి."

123 తొందరపడక తాపీగా ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఎటూ తేల్చుకోలేక పోయాడు. నరకంలో జీవితం బాగా లేదనిగాని, ఇతర లోకాలలో ఇంతకన్న బాగుంటుందని గాని వాడికి నమ్మం కుదరలేదు. వాడికి క్షుణ్ణంగా తెలిసినది భూలోకం. అది నరకంకన్నా చాలా ఛండాలం. ఆ విషయంలో 123 కు ఏమాత్రమూ సంశయంలేదు. ఇతర లోకాలలో ఇంకా బాగుంటుందన్న సంగతి తెలిసినవా డెవడన్నా చెబితే వెయ్యిన్నొకటికి తెలీదు. వాడు భూలోకపు జీవితమే మరిచాడు. తనలాగా మెసెంజరు కూడా కాడు. నరక కూపాలకు నూనె తయారు చేసేవాడు.

కాని, స్వర్గంలో కొద్ది కాలం ఉండి నరకానికి వచ్చిన వాళ్ళు తూర్పు నరకంలో ఉన్నారు. పుణ్యం తక్కువా, పాపం ఎక్కువా చేసుకున్నవాళ్ళు. 123 తూర్పు వెళ్ళి అలాటి వాళ్ళతో మాట్లాడాడు.

వాళ్ళు చెప్పినదాన్నిబట్టి స్వర్గంలో వర్ణనాతీతమైన సుఖాలు ఉన్నాయన్నది తేలింది. కాని అది మరీ శీతలపు దేశంగా 123 కు తోచింది. ఎంతసేపూ చల్లని గాలులను గురించే విన్నాడు. అక్కడ చాలా అందమైన అప్సరలుంటారుట. తెల్లగా ఉంటారుట. వాళ్ళ వర్ణన వింటూంటే 113 కు కామోద్రేకం కలగలేదు. స్వర్గం గురించి వినీ, వినీ "అక్కడంతా

లోపల్లా ఏం?" అని అడిగాడు 123. స్వర్గంలోవాళ్ళు కాలం ఎలా గడుపుతారంటే అప్సరతో కామక్రీడలూ, నందనవనంలో విహారాలూ, అమృతం తాగి మత్తుగా పడుకోవటమూ, ఇంద్ర సభలో నృత్యాలూ చెబుతారు! అదేం జీవితం?

1001 మళ్ళీ ఈ ప్రస్తావన తెచ్చినప్పుడు 123, "ఏమోనబ్బా! నాకు స్వర్గం అంటే అంత మంచి అభిప్రాయం కలగటంలేదు" అన్నాడు.

"అది నీ బానిస బుద్ధి! స్వర్గం తాలూకు పిక్చర్ పోస్ట్ కార్డయినా చూడకుండా నువు స్వర్గంకన్నా నరకమే మంచిదని తేల్చావు! అష్టాదశ పురాణాలు రాసిన వ్యాసుడుకూడా ఆ మాట అనలేదు. అధోలోకాలకన్న ఊర్ధ్వలోకాలు గొప్పవి. దక్షిణాదికన్న ఉత్తరాది గొప్పది. నల్లవాళ్ళకన్న తెల్లవాళ్ళు గొప్పవాళ్ళు—ఇవి తిరుగులేని సత్యాలు. నువు విప్లవంలో చేరితే చేవ మానితే మాను. నీబోటివాళ్ళచేత విప్లవం చేయించి నేను బాపుకునేది ఏమీ లేదు—మరి కొన్నివేల ఏళ్ళు నరకంలో వుండిపోవటం తప్ప. కాని నువు స్వర్గంకన్న నరకం గొప్పదంటే మాత్రం నేను సహించను!" అన్నాడు 1001.

అతని ఆవేశం చూస్తే తాను పొరపడి వుండొచ్చునేమోనని 123 కి అనుమానం కలిగింది.

"స్వర్గం గురించి చాలాసేపు విన్నాను. నాకేవో—"

"వినటం కాదు. ఉత్త పాండిత్యం చాలదు. ఆచరణ కావాలి. ఒక్కసారి బాస్ అనుమతితో స్వర్గం చూసిరా. తరువాత మాట్లాడదాం" అన్నాడు వెయ్యిన్నొకటి.

## 4

**123** తన పెళ్ళాంతో సంప్రదించాడు.

"ఏమీలేదు. నువ్వు ఇనర్షియాతో బాధపడుతున్నావు. మార్పంటే భయం! స్వర్గ సుఖాలను గురించి అన్ని లోకాలలోనూ గొప్పగా చెప్పుకుంటారు. నరకానికి పాపం చేసిన వాళ్ళు తప్ప రారు. మనం ఏం పాపం చేసి నరకంలో వుంటున్నాం? ఈ ఒక్క సంగతీ తేల్చుకో ముందు. వెయ్యినొకటి మాట నమ్మకపోతే గురువుగారిని అడుగు" అన్నది 123 భార్య.

తీరిక చూసుకుని 123 గురువుగారిని కలుసుకుని, "స్వామీ, నరకం పాపులకు కదా, మనబోటివాళ్ళం నరకంలో ఎందుకు వుంటున్నాం?" అని అడిగాడు.

"పాపులకూ మనకు చాలా తేడా వున్నది. రష్యాలో నేరస్థులను సైబీరియా పంపుతారు. సైబీరియాలో ఉన్నవాళ్ళు శిక్ష అనుభవించే నేరస్థులు కారు. ఇండియాలో నేరస్థులను అండమాన్ దీవులకు పంపుతారు—అక్కడే వుంటున్నవాళ్ళకు అండమాన్ దీవులలో వుండటం శిక్షకాదు. ఇథియోపియాలో బుజదాతా బుజాగ్రస్తుడూ చేతులకు బేడీలు వేసుకుని

కూర్చుంటారు. అందులో ఒకడిదే శిక్ష. ప్రపంచమంతటా జైళ్ళలో ఖైదీలతోబాటు రక్షకభటులూ ఉంటారు —"

"మరి తేడా ఎక్కడుందీ?"

"మనస్సులో!" అన్నాడు గురువుగారు తన బుర్రను చూపుడు వేలుతో కొట్టుకుంటూ.

"అంతా అనుకోవటంలోనే ఉన్నదండి!" అన్నాడు 123 జ్ఞానోదయమైన వాడిలాగా.

"ఎవరెంత చెప్పినా స్వర్గం బాగుంటుందని నేను నమ్మలేదు. దాన్ని మెచ్చుకునే వాళ్ళకు అది ఒక దురలవాటు అయి వుండొచ్చు. ఒకసారి నాతో చెప్పాడు. వాడు మొదటిసారి చుట్ట కాల్చి "ఛాఛా! ఇది ఎంత అసహ్యం! దీన్ని ఎవరైనా ఎందుక్కాలుస్తారు?" అనుకున్నాట్ట. కాని సంవత్సరం తిరిగే లోపల చుట్ట కాల్చకపోతే కళ్ళు బైర్లుకమ్మే స్థితికి వచ్చి జీవితంలో వున్న గొప్ప సౌఖ్యాలలో చుట్ట కాల్చటం ఒకటి అన్న స్థితికి వచ్చాట్ట. స్వర్గం అలాటి దుర్వ్యసనమేనేమో. అయినా అనుమతి లభిస్తే ఒకసారి చూసి రావటానికి నాకేమీ అభ్యంతరంలేదు" అన్నాడు 123 తన పెళ్ళాంతో.

నన్ను మరిచిపోమాక! దొరగారి దగ్గిర నాక్కూడా అనుమతి పుచ్చుకో!" అన్నది పెళ్ళాం.

"ముందు నా సంగతి తేలనీ!"

చిత్రగుప్తుడితో మాట్లాడితే అప్లికేషన్ పెట్టుకోమన్నాడు.

స్వర్గంలో ఒక వారంపాటు ఉండి రావటానికి అనుమతి వేడుతూ పాస్‌పోర్ట్ దయచేయించవలసిందిగా 123 అప్లికేషన్ పెట్టుకున్నాడు.

చిత్రగుప్తుడు వాణ్ణి పిలిపించి, "స్వర్గంలో వారంరోజులు ఎలావుంటావు? అది మనకు ఏడువందల ఏళ్ళు—నేను ఎక్స్చేంజ్ టేబిల్స్ తిరగేశాను. ఇన్—ఫ్లేషన్, నీకు అంత సెలవులేదు. కొద్ది గంటలు ఉండివచ్చే అవకాశం ఉంటుంది—వారు వీసా ఇస్తే" అన్నాడు.

"అది సంపాదించేదెట్లా?"

"అక్కడికి పోవలసిందే. వాళ్ళ ప్రతినిధి నరకంలో లేడు. వారికీ మనకూ సరిహద్దు తగాదా వచ్చాక ప్రతినిధులను వెనక్కు రప్పించేసుకున్నాం."

123 ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి, "స్వర్గం అంత దగ్గిరలో వుందా?" అన్నాడు.

"ఎంత దగ్గిరో అంత దూరం." చిత్రగుప్తుడు తెలివిగా నవ్వాడు, "మన ఉత్తరపు ద్వారం అవతల న్యూట్రల్ టెరిటరీ దాటితే స్వర్గమే."

"మీరెప్పుడన్నా వెళ్ళారా?"

"నాకు వీసా ఇస్తామన్నారుగాని ఇక్కడ గ్రేడ్‌వన్ ఆఫీసరుగా వుంటూ సౌహార్దం లేని చోటికి ఎందుకువెళ్ళి బ్లాక్‌మార్క్ తెచ్చుకోవటమని పోలేదు." అన్నాడు చిత్రగుప్తుడు లోపాయకారీగా.

మళ్ళీ 122 సందేహంలో పడ్డాడు, ఘడియా. అరఘడియా స్వర్గం చూడటం కోసం

వున్న లీవంతా వేస్ట్ చేసుకోవటం తెలివైనపనా? అదిగాక సత్సంబంధాలు లేని స్వర్గానికి వెళ్ళి దేశభక్తి లోపించిందన్న మాట తెచ్చుకోవటం—ఈజిట్ వరైట్?

"ఏం లీవు? వెధవ లీవు! తలంటుకుంటావా? ఒక్క విషయం అయినా స్వర్గానికి వెళ్ళిరా" అన్నది 123 పెళ్ళాం.

కింకరుడు 123 అప్లికేషన్‌మీద ముద్రా, చిత్రగుప్తుడి సంతకమూ పడ్డాయి.

## 5

కింకరుడు 123 నరకం ఉత్తరద్వారం దాటి, న్యూట్రల్ టెరిటరీ మీదుగా స్వర్గం దక్షిణ ద్వారం వెలపల ఉన్న క్వారంటైన్ చేరాడు.

అక్కడ ఒక ఆఫీసరు కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు. వాతావరణం చలి చలిగా ఉన్నది.

"ఏం కావాలి?" అన్నాడతను కింకరుణ్ని చూసి.

123 తన పాస్‌పోర్టు చూపించి, వీసా అడిగాడు.

"ఈ పాస్‌పోర్టు చెల్లదు. స్వర్గంలోకి ప్రవేశించాలంటే పుణ్యం సర్టిఫికెట్టు కావాలి. దాన్నిబట్టి స్వర్గంలో ఎంతకాలం ఉండొచ్చునో నిర్ణయించి వీసా ఇస్తాం."

"నేను పాపం చేసినవాణ్ణి కాదు."

"నరకం వాసన కొడుతున్నావు?"

"గ్రేడ్ ఫోర్ ఆఫీసర్ను. పాపిని కాను."

"పాపి కానంత మాత్రాన స్వర్గంలోకి రాలేవు. పుణ్యం చెయ్యాలి."

"డ్యూటీ చేస్తున్నాను—బ్లాక్ మార్కులు లేవు."

"అలాంటి రికార్డుగల పోలీసులు భూలోకంలో కోట్లకొద్దీ వున్నారు. వాళ్ళు పుణ్యాత్ములుకారు. స్వర్గంలోకి రాలేరు."

"పుణ్యం అంటే ఏమిటి?"

"డ్యూటీకి విరుద్ధంగానైనాసరే, సంప్రదాయాలకు విరుద్ధంగానైనాసరే, స్వార్థానికి విరుద్ధంగానైనాసరే ఇంకొకరికి మేలు చెయ్యటం! అదే పుణ్యం అంటే! విధి నిర్వర్తించటం పుణ్యంకాదు. పై అధికారిని సేవించటం పుణ్యంకాదు. జంతువులుగాని జంతువులలాటి వున్నత ప్రాణులుగాని పుణ్యం చెయ్యటం సాధ్యంకాదు."

123 చాలాసేపు ఆలోచించి, మీ స్వర్గంలోగాని, మానరకంలోగాని పుణ్యం చెయ్యటం ఎలాగ?" అని అడిగాడు.

"ఏ లోకంలోనైనా పుణ్యం చెయ్యటం చాలా కష్టం. కాని అసాధ్యంకాదు."

"అయితే నేను స్వర్గంలోకి అలా తొంగిచూసే అవకాశంకూడా లేదన్నమాటా?"

అన్నాడు కింకరుడు 123. గోడఅవతల ఏమున్నదో అని ఆశ్చర్యపడుతూ.

"సారీ, సాధ్యంకాదు. పుణ్యం చేసిరా ! మీ నరకంలో పుణ్యం చెయ్యటానికి ఎక్కువ ఆవకాశాలుండాలి నన్నడిగితే! ఏమంటే స్వర్గంలో దాదాపు ఏమీలేవు. స్వర్గంలో నీ సహాయం ఎవడిక్కావాలి ? అందరూ స్వయం సమృద్ధులే. నరకంలో అన్యాయాలకూ అక్రమాలకూ ఎక్కువ అవకాశం వుండొచ్చు. పంచశీల సూత్రాల ప్రకారం నేను మీ నరకం అంత రంగిక విషయాలలో జోక్యం కలిగించుకోరాదు. అందుచేత నీ పుణ్యం ఎలా సంపాదించు కుంటావో అది నీ సమస్య !" అన్నాడు స్వర్గ ద్వార రక్షకుడు.

123 తిరిగి రాగానే అందరూ "స్వర్గం చూశావా ? ఎలా ఉంది ?" అని అడిగారు.

"నేను స్వర్గం చూడలేదు కాని కొన్ని విషయాలు తెలుసుకున్నాను," అన్నాడు 123.

అతను 1001 ని కలుసుకుని, "నేను విప్లవంలో చేరుతున్నాను," అన్నాడు.

"వెరీ గుడ్" అంటూ 1001 మెంబర్ షిప్ కార్డుతీసి దానిమీద "కింకరుడు 123" అని రాశాడు.

ముద్రణ: 29 డిసెంబరు 1978, ఆంధ్రజ్యోతి వారపత్రిక.